# అమ్మకు కృతజ్ఞత!

■ పి. రామకృష్ణ

చంద్రశేఖర్ తల్లి వెంకటమ్మ ఆ తెల్లవారుజామునే చనిపోయింది. ఆమెకున్న ఏకైక సంతానం తానే కనుకా, దాయాదులూ, దగ్గరివాళ్ళూ అంటూ ఇంకెవరూ లేరు కనుకా శవాన్ని ఎక్కువ కాలం ఉంచనవసరం లేకపోయింది. ఆమె ఇంట్లోనే చనిపోగలిగిన అవకాశమైనా, ఇంటి యజమాని ముస్లిం కావడం వల్ల వచ్చిందే. లేకపోతే ప్రాణం ఉండగానే ఆమెను వీధిలో పడుకోబెట్టవలసి వచ్చేది. నిజానికి ఆమె అంతకు నెల ముందునుంచే శవమై పోయింది. అప్పుడు ఇంట్లో ఉంచుకోవలసిన శవమైతే, ఇప్పుడు ఇంట్లో ఉంచుకోకూడని శవం. అదే తేడా. అన్ని రోజులు వీధిలో ఆ శవప్రాయ శరీరాన్ని ఉంచుకోవలసి వచ్చి ఉంటే తమ గతి ఏమయ్యేది అని ఆలోచించేకొద్దీ ఇంటి యజమాని పట్ల కృతజ్ఞత పెరిగిపోయింది. ఇంకా ఆయన్ని ఇబ్బంది పెట్టకూడదన్నది కూడా ఆ సత్వర క్రియకు తోడయింది. ఇరుగూ పొరుగూ వారి సాయంతో మధ్యాహ్నానికే అంత్యక్రియలు పూర్తి చేసి ఇల్లు చేరుకున్నాడు.

ఇంట్లో తల్లి పడుకొని ఉండిన ఆ మూలన ఇప్పుడు పిల్లలు ఆడుకొంటున్నారు. ఏడాదిగా చూసిన దృశ్యం మారిపోయి కొత్త దృశ్యం వచ్చింది. సుశీల అప్పటికే మంచం బయట పడేసి, ఆ మూలతోపాటు గదంతా కడిగింది. గదిలో చల్లగా ఉన్న నేలమీద, గోడల వారగా చాక్‌పీస్‌తో గీతలు గీసింది. ముగ్గులన్నమాట! బయట కాంపౌండ్ గోడకు ఆన్చిన మంచం కనిపిస్తోంది. అక్కడక్కడా నవారు తెగిన మంచం, ఎముకలు విరిగిన ముసలమ్మలా దీనంగా, మౌనంగా ఉంది. చిత్రంగా అప్పుడొక వస్తువులా కాకుండా ఆలోచిస్తున్న మనిషిలా కనిపిస్తోంది. అమ్మ లేనందుకు విచారిస్తోందో, ఆమె నుంచి విముక్తి దొరికినందుకు సంతోషిస్తోందో తెలీడం లేదు. తాను? విచారిస్తున్నాడా, సంతోషిస్తున్నాడా? తెలీదు. సుశీల? సంతోషిస్తోన్నట్టుంది. లేకపోతే ఇంత తొందరెందుకు? సుశీల మీద కొంచెం చిరాకేసింది చంద్రశేఖర్‌కు. ఆ చిరాకులోనే తాను శ్మశానానికి వెళ్ళి వచ్చాడనీ, ఇంకా స్నానం చెయ్యలేదనీ జ్ఞాపకం వచ్చింది.

స్నానం చేసివచ్చి పడక్కుర్చీలో కూర్చుని, మళ్ళీ ఆ మూలకేసి చూస్తే, మళ్ళీ పంపెయ్యమని కానీ ఎన్నడూ అనలేదు సుశీల. అమ్మ పూర్తిగా మంచంలో పడకముందు కూడా ఆమె మీద ప్రత్యేకంగా ఎటువంటి ఫిర్యాదులూ చెయ్యలేదు. అమ్మకేవేవో జబ్బులొచ్చినప్పుడు డాక్టర్లకూ, మందులకూ జీతం డబ్బు చాలక అప్పులు చెయ్యవలసి వచ్చినప్పుడు కూడా, మీ అమ్మ కారణంగా మనం అప్పులపాలవుతున్నామనలేదు. పిల్లలకూ, తనకూ సరైన బట్టలు లేకపోయినా పోట్లాడలేదు. చాలామంది కంటే చాలా మంచిది సుశీల. ఎన్నడూ నిష్ఠురంగా మాట్లాడలేదు, ఏడవలేదు. ఏడవకపోవటం మంచిదే, కానీ నవ్వకపోవటం...

ఆ సంగతి గమనించేసరికి తనకేదో భయమేసింది. తాను ఇన్నాళ్ళూ సుశీలను బయట చూస్తున్నాడు, లోపల చూడలేదు. చాలా కాలంగా సుశీల



పిల్లలిద్దరూ నేలమీద పడి దొర్లుతున్నారు. ఎన్నాళ్ళగానో తమ ఉపయోగంలో లేని స్థలాన్ని ఇప్పుడు ఉపయోగంలోకి తెచ్చుకోగలిగామన్నట్టుగా వాళ్ళు సంతోషిస్తున్నారు. వాళ్ళ సంతోషాన్ని గమనిస్తుంటే, సుశీల వాళ్ళకోసం గదిని శుభ్రం చేసిందే కానీ, 'పీడ పోయింది' అనుకున్నట్టుగా ఏం లేదని అనిపించ సాగింది. శవాన్ని అలా బయటకు తీసుకువెళ్ళగానే, ఈమె గదినిలా శుభ్రం చేసుకోవడం చూసినవాళ్ళు అలా అనుకుంటారనే (పీడ పోయింది అనుకుంటున్నట్టు) తాను చిరాకు పడ్డాడు. ఇంట్లో ఎవరూ ఆ మూలకు కొంత కాలంగా పోవడమే లేదు. ఒక రకంగా నిషేధిత ప్రాంతంలాగా ఉండేది. అప్పుడప్పుడూ తాను మాత్రం వెళ్ళేవాడు. ఏ స్నేహితులో, పక్కింటివాళ్ళో ఇంట్లోకి వచ్చినప్పుడు ఇబ్బందిగా ఉండేది. వాళ్ళు కూడా ఆ కొంచెంసేపట్లోనే ఇబ్బంది పడుతూ, ఇబ్బంది పడుతున్న తమమీద జాలిపడుతున్నట్టూ కనిపించేవాళ్ళు.

రెండున్నర గదుల ఇంట్లో (ఇంకో అర గది వంటిల్లు) ఒక గదిని సగం ఉపయోగించుకోకుండా, ఇద్దరు పిల్లల్తో తామిద్దరూ ఉండటం కష్టం కదా! నిజానికి మిగిలిన ఆ సగాన్ని కూడా ఉపయోగించుకోనట్టే లెక్క. ఉపయోగించుకోలేని సగం గదిలో ఏ సామానో ఉంటే, మిగిలిన సగం గదినైనా ఉపయోగించుకోవచ్చు. కానీ, అక్కడ సామాను కాక మంచంలో పడిన మనిషి ఉన్నప్పుడు... అవతలి సగాన్ని కూడా ఉపయోగించుకోలేమని ఆలోచించగలిగినవాళ్ళందరికీ అర్థమవుతుంది. అటువంటి పరిస్థితిలో ఉండిన సుశీల ఇప్పుడు తొందర పడిందంటే తప్పేముంది? అలా అనడమే తప్పు. తమ అవస్థను చూస్తూ వచ్చినవాళ్ళెవరూ అలా అనుకోరు. ఎవరన్నా అనుకున్నా, అనుకోకపోయినా, ఎందుకైనా మంచిది అంత తొందరెందుకు (పోయిన ముసలామె మళ్ళీ వచ్చేదేం లేదు కదా!) అని తనకు అనిపిస్తోంది. సరే, అయిందేదో అయింది. ఇంకేమవుతుంది?

సుశీల ఇకనైనా అమ్మ రాక ముందటి సుశీల అవుతుందా మళ్ళీ? నిజానికి సుశీల ఇంకో సుశీల అయినట్టు, అయ్యేదాకా తాను గమనించనే లేదు. ఎందుకు గమనించలేకపోయాడు? మీ అమ్మను తీసుకురావద్దని కానీ, తెచ్చిన తర్వాత ముఖంలో నవ్వు కనిపించడమే లేదని అప్పుడు జ్ఞాపకం వచ్చింది. ఆ మొక్కలో పచ్చదనపు జీవం తగ్గి పాలిపోతోంది. ఎక్కడో పురుగేదో నేలలోనే వేర్లను కొరికేస్తున్నట్టుగా వెలవెలపోతోంది.

"అలా ఉంటున్నావేమిటి ఈ మధ్య" అంటే,

"మామూలుగానే ఉంటున్నానే" అంది.

"నువ్వెలా నవ్వుతావో నేను మర్చిపోయాను."

పలకలేదు. ఏదో చిరిగిన చీరను కట్టుకుంటోంది.

"ఎలా నవ్వాలో నువ్వూ మర్చిపోయావా?"

దానికీ పలకలేదు.

"కారణమేమిటి? ఎందుకని నవ్వడమే లేదు."

"నవ్వడానికి కారణమేముంది" అంది.


"ఇంతకు ముందు ఉండేవా? ఇప్పుడేమయ్యాయి?"

"ఏమో మరి" అంది. అప్పుడు కూడా ఏమాత్రం నవ్వలేదు. తనకేదో అవమానమనిపించింది. సుశీల నవ్వటానికి కారణాలను ఎక్కణ్ణుంచి తేవాలి? "నాకోసం ఒక్క నవ్వు. ఏదీ నవ్వవూ" అని ప్రియుడిలా అభ్యర్థించలేడు. తాను ఆమెకు ప్రియుడు కాదు. అసలు జీవితమే ప్రియంగా లేదు.

"పోనీ, నవ్వకుండా ఉండటానికి కారణం అమ్మేనా?" తన గొంతులో కొంచెం కరకుతనం పలికింది. సుశీల చురుగ్గా చూసింది.

"ఎప్పుడైనా అలా అన్నానా?" ఆమె గొంతులో కొంచెం కోపమూ, ఎక్కువ దుఃఖమూ కలసిన జీర.

"అన్లేదు కానీ..." అందామనుకున్నాడు. అప్పటికే నొప్పించినట్టు తెలిసి



ఎముకలు విరిగిన

అమ్మ లేనందుకు

చిత్రాలు: నర్సిం



అక్కడక్కడా నవారు తెగిన మంచం, ముసలమ్మలా దీనంగా ఉంది. చిత్రంగా అప్పుడొక వస్తువులా కాకుండా, ఆలోచిస్తున్న మనిషిలా కనిపిస్తోంది. విచారిస్తోందో, సంతోషిస్తోందో తెలీడం లేదు.

ఆగిపోయాడు.

"ఇంకా మీరే మీ అమ్మను వినుక్కుంటున్నారు" అని లేచి వెళ్ళిపోయింది. తన తప్పును ఆమెమీద వెయ్యాలని చూస్తున్నట్టు అనుకుందా? అందుకని, "ఆమె ఉండటం ఇష్టం లేనిది మీకే" అని సూచించిందా? ఒకవిధంగా అది తిరుగుబాటా? ప్రతీకారం తీర్చుకోవడమా? చేసిందంతా చేసి మళ్ళీ నవ్వలేదనీ, అమ్మ ఉందనా అనడగటమూ... ఈ నాటకాలు దేనికి అనుకుందా?

అమ్మను తీసుకురాకుండా ఉండటమెలా? ఆ పల్లెటూళ్ళో, అరవై ఏళ్ళు పైబడిన ఆమె ఇల్లుంటే మాత్రం ఒంటరిగా ఎలా ఉంటుంది? అప్పటికీ ఆమె తాను అప్పుడప్పుడూ పంపే రెండొందలో, మూడొందలో డబ్బుతోనూ, ఆ పనిలోనో, ఈ పనిలోనో సాయపడితే ఊళ్ళోవాళ్ళు ఇచ్చేవాటితోనూ గడుపుతూ వచ్చింది. "ఒక్కగానొక్క కొడుకు దగ్గరుండకుండా ఒక్కదానివీ ఇక్కడెందుకు కష్టపడతావే" అనడిగేవాళ్ళకు, "ఓపిక లేనప్పుడు అట్లాగే చేస్తా" అని చెబుతూ వచ్చింది. ఆ ఓపిక ఆమెలో సన్నగిలుతోందని తెలిశాక, ఒక్కగానొక్క కొడుకైన తాను ఊరికే ఎట్లా ఉంటాడు? అప్పటికే, "మీ అమ్మను తీసకపోరాదా పాపం" అని ఎంతమంది తనతో అనలేదు! అంతకు ముందు, "నువ్వొ మా దగ్గరికే రామ్మా" అంటే, "ఉండూరిడిసి ఆ పట్నం కొంపలో ఉండలేన్లే సెంద్రా" అనేది. "మీ అమ్మను తీసకొచ్చుకో" అన్నవాళ్ళకు, "మాయమ్మ ఉండూరిడిసి రానంటాది" అని చెబుతూ వచ్చాడు. ఆమె రాలేననడమూ, తాను ఆమె రావడం లేదనడమూ కుదరదని తెలిశాక కదా తీసుకొచ్చింది.

నాయన తనకు జ్ఞాపకం రాకముందే పోయాడు. తనకూ నాయన ఉండేవాడు అనుకోవడం తప్ప, నాయన ఇట్లా ఉండేవాడని జ్ఞాపకం చేసుకునేందుకు అవకాశం లేదు. "అమ్మా! మా నాయన ఎట్లా ఉండేవాడు" అని అమ్మనడగటం జ్ఞాపకముంది. దానికి ఆమె ఏమంది. "ఏమోనబ్బా! ఎవురికి తెల్సు" అంది. "అదేంది! నీకు తెలవకపోవడమేంది" అనడిగాడు. అమ్మ కొంచెంసేపు ఊరుకొని, కొంచెం వణుకుతున్న గొంతుతో అంది: "ఆయప్ప మొకం నేను సూసిందల్లా ఆయప్ప సచ్చిపోయినప్పుడే!" ఆ మాట ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. ఆ మాట అన్నప్పుడు ఆమె ఎవరిమీదో జాలిపడుతున్నట్టు చెప్పడమూ జ్ఞాపకముంది. ఆ జాలి చచ్చేదాకా ముఖం చూడనివ్వని 'ఆయప్ప'మీదనో, చూడలేకపోయిన తనమీదనో ఇప్పటికీ తేలీదు. "ఎత్తుగా, లావుగా, ఇంత పొడుగు మీసాల్తో ఉండేవాడు. ఎదురుగా పోడానికే బయమయ్యేది నాకు. ఎగాదిగా సూసిందెప్పుడు?" ఎత్తుకున్న బరువును దించుతున్నప్పుడు నిటూర్చినట్టుగా అమ్మ చెబుతూపోయింది.

అట్లాంటి పిల్లీ ఎలుకా దాంపత్యానికి పుట్టినవాడు తాను. అమ్మ, 'భార్య'గా ఎలుకలాగా బతికిందేమో కానీ, 'అమ్మ'గా పులి అయింది. ఆ మూడెకరాల పొలం చేయించుకుంటూ, కూలి పనులకు కూడా వెళ్తూ, తనను ప్రొద్దుటూరు ఆశ్రమం స్కూల్లో ఉంచి చదివిస్తూ వచ్చిన అమ్మను తల్చుకుంటే, అప్పుడామె పులి మాదిరిగా బతికిందనే అనిపిస్తుంది. ఆడవాళ్ళ పని, మగవాళ్ళ పని అన్న తేడా లేకుండా కష్టం చేసింది.

"ఏ పనిలో ఇడిసినా ఎంగటమ్మ పులి. ఆమె ముందు మొగోడెందుకు" అని ఊరివాళ్ళు అనడమూ తెలుసు. ఆడవాళ్ళకూ, మగవాళ్ళకూ మధ్య అసమానత అనేది లేకుండా ఉన్నట్టయితే సుశీల తన భార్య అయ్యేది కాదు. ఆమె కుటుంబ నేపథ్యం, తన కుటుంబ నేపథ్యం కన్నా పై స్థాయిది. చిన్నదైనా ఉద్యోగం ఉండటమూ, చెల్లెళ్ళూ, తమ్ముళ్ళూ అంటూ ఎవరూ లేకపోవటమూ, ఉన్న తల్లి ఎక్కడో పల్లెటూళ్ళో ఉండటమూ తనకు ప్లస్ పాయింట్లే అయ్యాయి. "ఆ సంబంధం చేసుకుంటే నీ కొడుకు నీకు దూరమౌతాడు. నీకు తగింది సూసుకో" అని బెదిరించినా అమ్మ భయపడలేదు. "వాడు బాగుంటే సాలు. నాదేముంది? ఎట్టయినా బతుకుతా" అంది.

"ఆ సంబంధం" తనను అమ్మకు దూరం చేసిందా? ఒకసారి 'లేదు' అనిపిస్తుంది. ఇంకోసారి 'చేసిందేమో' అనిపిస్తుంది. ఏది నిజం? ఇంతకు ముందు అనుకున్నట్టుగా సుశీల చాలా మంచిదనడానికి సందేహం లేదు. అమ్మ ఉన్నందుకు ఎన్నడూ అసంతృప్తిని తెలుపలేదు. అయితే, అంతకు ముందున్న దేన్నో పోగొట్టుకున్నట్టు ఉండడం దేనికి? "ఏమీ లేదు" అని అంటున్నా, ఏమీ లేదని అనిపించడం లేదు. తాను ఆ విషయమై సుశీలతో ఎట్లా తగాదా పడతాడు? "నవ్వకపోవడానికి కారణం అమ్మేనా" అనడిగితే ఎంత బాధపడింది! ఆమెనట్లా బాధపెట్టడం ఏం న్యాయం? బయటికి తన అసమ్మతిని కానీ, అసంతృప్తిని కానీ వ్యక్తం చెయ్యలేదు. అటువంటప్పుడు నీ మనసులో ఏదో ఉంచుకుంటున్నావని, ఆమె తన మనసులో కూడా ఏమీ ఉంచుకోరాదనడం అన్యాయం కదా! ఆమె నుంచి అంత ఆశించగలిగిన అధికారం తనకెక్కడుంది? "ఇంకా నువ్వే మీ అమ్మను అప్పుడప్పుడూ వినుక్కుంటున్నావ్" ఆ మాట ఇంకా వినిపిస్తూ ఇబ్బంది పెడుతున్నట్టు, చంద్రశేఖర్ పడక్కుర్చీలో అటూ ఇటూ కదిలి సర్దుకుని కూర్చున్నాడు.

సుశీల ఎన్నడూ అమ్మను గురించి ఏమీ అనకపోవడమూ, తాను ఆమెను గురించి వినుక్కోవడమూ నిజమే. అమ్మ రోజూ ఏదో ఒకటి బాగా లేదనేది. ఒకరోజు గుండెల్లో మంట, మరోరోజు కడుపులో నొప్పి. ఒకసారి కళ్ళు తిరగడం, మరోసారి ఒళ్ళు తూలడం, ఈ రోజు విరేచనాలు రాకపోవడం, మరునటిరోజు విరేచనాలు రావడం, నడుం నొప్పి, మెడ నొప్పి... ఇట్లా ప్రతిదానికీ డాక్టర్లు అన్ని పరీక్షలూ జరిపి ఏమీ లేదని చెప్పి, ఇంత పొడుగు మందులూ, మాత్రల జాబితా



ద్వారా పరిష్కరించిందా? సుశీలా, తానూ ఇటువంటి పరిష్కారాన్ని కోరుకుంటూ వచ్చారా? ఎంత దారుణం!


ఛీ, ఛీ... సుశీల అలాంటిది కాదు. తానూ అంత దుర్మార్గుడు కాదు. అమ్మ చనిపోవాలని కోరుకునేంత దుర్మార్గుడా తాను కాదు. అయితే, అమ్మ చనిపోయిందని తెలిసినప్పట్నించీ, శవ సంస్కారానికి ఒకవైపు ఏర్పాట్లు చేసుకుంటున్నా, ఇంకోవైపు, "ఇక అమ్మ ఉండదు. తానూ, సుశీలా, తమ పిల్లలూ" అన్న ఆలోచన ఎందుకు కలుగుతూ వచ్చినట్టు? ఇక సుశీల అమ్మ రానప్పటి సుశీల అవుతుందని ఎందుకూహిస్తూ వచ్చినట్టు? సుశీల మాత్రం? అమ్మ శవాన్ని అలా తీసుకెళ్తానే, ఈ మధ్య ఎన్నడూ కనిపించని చురుకుదనాన్ని చూపడానికి అర్థం ఏమిటి? "పీడ పోయింది" అన్న భావం లేకపోవచ్చు, "అమ్మయ్య" అనుకున్న ఓ రకం 'రిలీఫ్' దొరికిందన్న ఉత్సాహం అందులో లేదా?

నిజంగా అమ్మ ఇంకా కొంతకాలం బతికి ఉంటే ఏమయ్యేది? సుశీల ఇప్పుడున్నట్టు కూడా ఉండలేక పోట్లాటలకు దిగేదా! ఏడ్చి గొడవలు పెట్టుకుని పుట్టింటికి వెళ్ళిపోతాననేదా? ఏ ఉద్యోగమో చూసుకుని వేరుగా ఉంటాననేదా? తాను సుశీలను కొట్టేంతవరకు దిగజారేవాడా? ఆ హింసకు సుశీల ప్రతిహింస పద్ధతికి దిగేదా? ఇప్పటికే అన్నిట్లోనూ అనాసక్తంగా (అవును, ఆ 'సుఖం' పట్ల కూడా) ఉంటోంది. అప్పుడింక తనను అవమానించవచ్చు. భరించలేక తాను తాగుబోతు అయ్యేవాడా? ఇంటి నుంచి పారిపోయేవాడా? ఆలోచించేకొద్దీ ఎంత భయమేస్తోందీ! ఆ భయం నుంచి, ఆ పరిస్థితి నుంచీ అమ్మ తమను తప్పించిందా!

అమ్మను తల్చుకునేకొద్దీ చంద్రశేఖర్ కృతజ్ఞతతో కుంగిపోయాడు.

అమ్మ చనిపోయినప్పట్నించీ ఇంతవరకూ రానంత దుఃఖం ఇప్పుడొచ్చేసింది. అమ్మయినా సరే మరణించడం సహజం. కానీ, ఆమె మరణించినందుకు కృతజ్ఞత తెలియజేసుకోవలసిరావడం అసహజమైనదీ, చాలా విషాదకరమైనదీ కదా! అందుకేనేమో, అమ్మ మరణించినప్పటికంటే చంద్రశేఖర్‌కు ఇప్పుడెక్కువ దుఃఖం రావడం! ■

**తాను ఇన్నాళ్ళూ సుశీలను బయట చూస్తున్నాడు, లోపల చూడలేదు. సుశీలలో నవ్వు కనిపించడమే లేదని అప్పుడు జ్ఞాపకం వచ్చింది.**




ఇవ్వడం! ఆ మందులూ, మాత్రలూ వేసుకోవడానికో గొడవ. ఎప్పుడు దేనికని మందులూ, మాత్రలూ తెస్తే, ఆ మరుసటిరోజు 'అదిప్పుడు లేదు కనుక మాత్రలేసుకోవడం ఎందుకూ, దండగ! ఈసారొచ్చినప్పుడు ఏసుకుంటాలే' అంటుంది. "వేసుకోకపోతే డబ్బు దండగ అవుతుంది" అని కేకలేసి వేస్తే, ఆ తర్వాత ఆ మందులు వాడటం వల్ల తనకు బాగా లేదని ఇంకోరకం ఫిర్యాదులు.

ఈ కొత్త ఫిర్యాదులు డాక్టర్లకు చెబితే, "వట్టి మందులు వాడితే లాభం లేదు. వాటితోపాటు మంచి ఆహారం ఇవ్వాలి" అని వాళ్ళు ఉచిత సలహాలు (వీటికి ఫీజు తీసుకోరుగదా) ఇవ్వడం. తన మూడువేల రూపాయల జీతంతో అందరికీ ఏదో ఆహారమైతే ఉంటుందేమో కానీ, మంచి ఆహారం ఎలా ఉంటుంది? సరే, ఆ 'మంచి ఆహారం' కావలసింది అమ్మకు మాత్రమే కదా అని ఆ ప్రయత్నం చేశాడు. ఫలితం, మిగతావాళ్ళకు కనీసాహారం కూడా లోపించడం. సుశీల మొహంలోనూ, పిల్లల మొహంలోనూ ఎముకలు తేలాయి. అమ్మ ఇంతగా ఆరోగ్యం చెడిపోయేదాకా, 'మంచి ఆహారం' అవసరమయ్యేదాకా ఆ పల్లెటూళ్ళో పడివుండకుండా, ఆ వచ్చేదేదో ఇంతకుముందే వచ్చి ఉండకూడదా అని చిరాకేసేది. అంతకు ముందు తానూ రమ్మని ఆమెను గట్టిగా కోరలేదన్నది అప్పుడు జ్ఞాపకం వచ్చేది కాదు.

ఇంతకు ముందే ఆమె వచ్చి ఉంటే మంచిదనుకుంటున్నప్పుడు, ఆ ముందు ఆమెను ఎందుకు రమ్మనలేదు? ఆమె రాననేదిగా! అది తాను చెప్పినమాట. నిజమదేనా? అప్పుడప్పుడూ అమ్మను విసుక్కున్నది ఆమె మందులు సరిగా వేసుకోవడం లేదనేనా? కేవలం అందుకే కాదని సుశీలకు తెలిసిపోయిందా? ఆ మాటలో అర్థం అదేనా? సుశీల అలా ఉండడానికి కారణం తనకు తెలిసినట్టే. తన విసుగుదలకు కారణం సుశీలకూ తెలుసా? ఇద్దరూ ఇద్దరి కారణాలనూ తెలుసుకుని, ఆ సంగతి పరస్పరం బయటికి చెప్పుకోకుండా ఉంటూ వచ్చారా? ఇప్పుడు అమ్మ తన జీవితాన్ని ముగించడం ద్వారా ఈ నాటకానికి ముగింపు పలికిందా? తమ సమస్యలను తాను నిష్క్రమించడం